క్లుప్తంగా

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


నవనీత ఫైల్

నడికూడ: అనారోగ్యంతో విద్యార్థిని మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని రామకృష్ణాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల జగన్ కూతురు ఎరుకల నవనీత (17) హైదరాబాదులోని ఓ ప్రవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో 12 రోజుల నుంచి అనారోగ్యంతో యశోద హస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. చదువు కోసం వెళ్లి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రామకృష్ణాపూర్ వాట్సాప్ గ్రూప్‌లో ఇటీవల నవనీత గీసిన చివరి బొమ్మను గుర్తు చేసుకుంటూ 'వీ మిస్ యూ సిస్టర్' అంటూ సంతాపం తెలుపుతున్నారు.

మండల అధ్యక్షుడిగా బ్రహ్మాచారి


బ్రహ్మాచారి

కమలాపూర్: విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా ఎగ్గోజు బ్రహ్మాచారి ఎన్నికయ్యారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ కులస్తులు సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బెజ్జంకి శంకరమూర్తి, ఉపాధ్యక్షులుగా చల్లూరి శేఖర్, చిట్టోజు స్వామి, ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి మల్లయ్య, కార్యదర్శిగా చంద్రగిరి చంద్రసేన, సహాయ కార్యదర్శిగా కలకోటి రాజయ్య, ప్రచార కార్యదర్శిగా కనకుంట్ల రాజు, కోశాధికారిగా చెంగెల్లి రవీందర్ ఎన్నికయ్యారు.

గ్రామసభ ద్వారా పనుల గుర్తింపు

ఐనవోలు: 2024-25 సంవత్సరానికి గాను గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులను గుర్తించేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ముందుగా గ్రామాల్లో మహాత్మా గాంధీ జయంతిని నిర్వహించి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామసభను నిర్వహించి గ్రామంలో చేపట్టాల్సిన పనుల వివరాలను గ్రామస్తుల నుంచి సేకరించినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల గ్రామ సభల్లో ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ నక్క కుమారస్వామి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కమలాపూర్: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫొటోఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు విడపు ప్రతాప్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎస్సై కరుణాకర్ చేతులమీదుగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మండలంలోని ఫొటో, వీడియోగ్రఫర్లు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సహాయ కార్యదర్శి రాజేందర్, సభ్యులు రామ్మూర్తి, కరుణాకర్, రాజు, రమేష్, సందీప్, రాజమౌళి, నరేష్, శ్రీధర్, రాంచందర్, సాయి, రాకేష్, రాజు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

పరకాల: హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం జరుగనున్న జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు పట్టణంలోని జ్యోతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అల్లం యతిన్‌రెడ్డి, మెతుకుపల్లి యశ్వంత్‌రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఆగి, వ్యాయమా ఉపాధ్యాయుడు ఎండపెల్లి కిరణ్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను వారు అభినందించారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

ఎల్కతుర్తి: ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన మోదీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం కామెర వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారులకు కొమ్ముకాస్తున్నాయని అన్నారు. ప్రధాని మోదీ ప్రజాధనాన్ని ధనిక వర్గాలకు ముట్టజెప్పుతూ దేశాన్ని దివాలా తీసే విధంగా అవలంభిస్తున్నారని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టిస్తామని చెప్పి లక్షలాది మంది నిరుపేదలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయించారని, కానీ ఇప్పటి వరకు ఒక్క ఇల్లు పూర్తి కాలేదని అన్నారు. మాయమాటలతో కేసీఆర్ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు.

సర్పంచ్‌కు సన్మానం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో 33బై11 కేవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేశారు. దీంతో సర్పంచ్‌ను డీఈలు సామ్యానాయక్, ఆనంద్, ఆపరేషన్ సివిల్ ఏడీఈలు సన్మానించారు.

పరకాల: పూలమాల వేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్



దామెర : గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, తదితరులు



ధర్మసాగర్: వేలేరులో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ మాధవరెడ్డి



ధర్మసాగర్ : మల్లక్‌పల్లిలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ రాజు



బాపూజీకి ఘన నివాళి

భారతదేశ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు గాంధీ చిత్రపటాలకు పూలమాల వేశారు. అలాగే పరకాల పట్టణంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ.. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి పరకాల మార్కెట్ రోడ్డు జంక్షన్‌కు గాంధీచౌక్‌గా నామకరణం చేశారు. ముల్కనూర్‌లో మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సర్కిల్ కార్యాలయంలో సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌ల్లో ఎస్సైలు రాజ్‌కుమార్, సాయిబాబు, వెంకటేశ్వర్లు, ఐనవోలులో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


శాయంపేటలో..


ఐనవోలు : గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మధుమతి, ఆ పార్టీ నాయకులు


ఎల్కతుర్తి: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి


పరకాల: మార్కెట్ జంక్షన్ (గాంధీ చౌక్) వద్ద గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు


ఆత్మకూరులో..


కమలాపూర్ : పూలమాల వేస్తున్న సర్పంచ్


కమలాపూర్ : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెప్పాలి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే ధర్మారెడ్డిని అడ్డుకుంటున్న మహిళలు

నడికూడ: అధికార పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కౌకొండ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించి రూ.1. 55 కోట్లతో కౌకొండ నుంచి నర్సింహుల పల్లి, ఒర్రెబాట వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అంధకారం చేస్తే, 9 ఏళ్లు పాలిస్తున్న సీఎం కేసీఆర్ గ్రామాల్లో 24 గంటలు వెలుగులు తీసుకొచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీవి ఆచరణ సాధ్యం కాని హామీలని, ఆ పార్టీకే తెలంగాణలో గ్యారంటీ లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతన్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడంలేదని, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. కాగా ఎమ్మెల్యే బైక్‌పై గ్రామంలో పర్యటిస్తుండగా మహిళలు అడ్డుకున్నారు. తమ కాలనీకి సీసీ రోడ్డు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, వైస్ ఎంపీపీ చంద కుమారస్వామి, ఎంపీటీసీ మేకల సతీష్, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, గణపతిరెడ్డి, సదానందం, అనిల్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

స్వచ్ఛతా లీగ్ 2.0 ర్యాలీ

పరకాల: స్వచ్ఛ, శుభ్రమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యుడు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గంగిశెట్టి జీవన్‌రావు సిబ్బందితో కలిసి స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ ప్రాగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజనర్సు, చంద్రమోహన్, రమాదేవి, బీపీఎంలు ఎల్లేష్, సాయివర్షిత్, శివనాగు, అరుణ్‌కుమార్, రవళి, లత, ప్రకాష్ పాల్గొన్నారు.

స్నేహబంధం సీడీ ఆవిష్కరణ

పరకాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన రచయిత దాసారపు నరేష్ రచించిన స్నేహబంధం పాటల సీడీ ఆవిష్కరణ సోమవారం పట్టణంలోని గణపతి విద్యాసంస్థల అధినేత చందుపట్ల నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. గణపతి బీఎడ్ కళాశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో సీడీని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువు గొప్పదనంతో పాటు స్నేహగొప్పదనం, మాధుర్యం, త్యాగాలను అర్థం చేసుకొని లక్ష్య సాధన కోసం శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులపై మండిపాటు


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఎల్కతుర్తి: ఇళ్లులేని నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి జాబితాలో అనర్హుల పేర్లను నమోదు చేస్తున్నారని భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌లో సోమవారం గ్రామ పంచాయితీ వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి అర్హుల పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి


మాట్లాడుతున్న ఎంపీటీసీ జ్యోతి

ధర్మసాగర్(వేలేరు): స్థానిక ఉపసర్పంచ్‌తో తనకు ప్రాణహాని ఉందని తనను రక్షించాలంటూ ఎంపీటీసీ బత్తుల జ్యోతి వాపోయారు. వేలేరు మండల కేంద్రంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీగా గెలిచిన అనంతరం ఎంపీపీ ఎన్నికల్లో ఎంపీపీ సమ్మిరెడ్డికి మద్దతు తెలుపడంతో అమ్ముడు పోయానని ఉపసర్పంచ్ సద్దాం వ్యక్తగత దూషణలకు పాల్పడినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడని కన్నీటి పర్యంతమయ్యారు. కొన్ని నెలల క్రితం తన భర్త చనిపోగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు పరామర్శించి ప్రభుత్వం స్థలంలో ఇల్లు మంజూరు చేస్తామని, పంచాయతీ నుంచి లెటర్ తీసుకు రావాలని సూచించినట్లు పేర్కొన్నారు. దీంతో గ్రామ సభలో చర్చ జరుగగా సద్దాంహుస్సేన్ కొంత మంది మహిళలను తీసుకువచ్చి తనకు ఇంటి స్థలం ఇస్తే మిగతా మహిళలకు కూడా ఇవ్వాలని గ్రామ సభలో గొడవ చేసినట్లు ఆమె వాపోరారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు హాస్యాస్పదం

శాయంపేట : మండలానికి అంబులెన్స్ కేటాయించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అంబులెన్స్ కేటాయించడం పెద్ద పనేం కాదని కాని డ్రైవర్‌కు వేతనం, డీజిల్ ఖర్చులు ఎవరు భరిస్తారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని దళిత సంఘాల నాయకులు విమర్శించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం వారు మాట్లాడుతూ మండలానికి అంబులెన్స్ లేకపోవడంతో అపద సమయంలో నిరుపేదల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందిస్తే జీతాలు లేకుండా మండల ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. మండలానికి వెంటనే అంబులెన్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్, నరేష్, సుమన్, పవన్‌కల్యాణ్, ప్రతాప్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యమకారులే ఎమ్మెల్యేను ఓడిస్తారు


మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల: తెలంగాణ ఉద్యమకారులే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఓడిస్తారని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణంలోని గాంధీ విగ్రహం శిథిలావస్థలోకి చేరుకుంటే దాన్ని పునరుద్ధరించే ఆలోచన చేయలేని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గాంధీ జయంతి రోజున నివాళులర్పించడం విడ్డూరంగా ఉందన్నారు. బస్టాండ్ కూడలిలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని గతంలోనే బీజేపీ తరుపున కోరినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలైన దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధు వంటి పథకాలను తన అనుచరులకే మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, పట్టణ ప్రధానకార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, కౌన్సిలర్స్ కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ సర్పంచ్ సిరంగి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ మంజూరు గొప్ప కానుక

పరకాల: ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.900 కోట్లతో గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయడం గొప్ప విషయమని, రాష్ట్ర పర్యటనలో గొప్ప కానుక ఇచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతిఒక్కరూ రుణపడి ఉండాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగవీరుల కోసం పట్టణ బీజేపీ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో అమృత కలశానికి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకునేందుకు ఢిల్లీలో అమృత స్మృతి వనం నిర్మించడం గొప్ప విషయమని కొనియాడారు.

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన అక్షయ్

ఆత్మకూరు : సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1వ తేదీలో హైదరాబాద్ నాచారం (డీపీఎస్)లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ అండర్ -11 డబుల్స్ విభాగంలో మండల కేంద్రానికి చెందిన సిరిపురపు అక్షయ్‌కుమార్ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే నవంబర్ నెలలో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. తనకు శిక్షణ ఇచ్చిన జేఎస్ఎస్ బ్యాడ్మింటన్ కోచ్ రమేష్‌కు విద్యార్థి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ రమేష్, క్రాంతి, సాయి, వరంగల్ బ్యాడ్మింటన్ సెక్రెటరీ రమేష్‌రెడ్డి, అధ్యక్షుడు రమేష్, నాగకిషన్, డీవైఎస్ఓ అశోక్‌కుమార్ తదితరులు అభినందించారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న బొరె శ్రీనివాస్

ధర్మసాగర్: 'వయోజన విద్యలో 2010 నుంచి 2019 వరకు సాక్షరభారత్ కో-ఆర్డినేటర్లుగా దాదాపు పదేళ్లు వెట్టి చాకిరి చేయించుకున్నారు. మమ్మల్ని నడి రోడ్డుపై వదిలేశారు. తిరిగి మమ్ముల్ని విధుల్లోకి తీసుకోవాలి' అని సాక్షరభారత్ గ్రామ కో-ఆర్డినేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొరె శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేశ్ అధ్యక్షతన సోమవారం జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ.. సాక్షర భారత్ కో-ఆర్డినేటర్‌గా వయోజనులకు విద్య చెప్పడంతో పాటు గ్రామ పంచాయతీలో ఒక జూనియర్ కార్యదర్శిగా ఎన్నో పనులు మాతో చేయించుకున్నారని తెలిపారు. హరితహారం, రైతు బంధు, రైతు బీమా సర్వేలు, స్వచ్ఛ భారత్‌లో భాగంగా మరుగు దొడ్ల కోసం సర్వే, అదనంగా ఎన్నికల నిర్వహణలో బీఎల్ఓలుగా విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్పందించి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేదా గ్రామ పంచాయతీల్లో, లేదా ఇంకా ఏదైనా డిపార్టుమెంట్‌లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టాలని అన్ని రాజకీయ పార్టీలను విన్నవించినట్లు తెలిపారు. తమ సమస్యలను పట్టించుకున్న పార్టీలకు ఉండగా ఉంటామన్నారు. ప్రతీ గ్రామానికి ఇద్దరు కో-ఆర్డినేటర్లు ఉన్నారని రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల మంది ఉన్నట్లు తెలిపారు. తమను విస్మరిస్తే సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఆంజనేయులు, కిష్టయ్య, రాజన్న, శ్రీదేవి పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు అమలు
- టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయరావు


నినాదాలు చేస్తున్న సత్యనారాయణ, నాయకులు

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైందని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో పీఏసీఎస్ భవనం, మాందారిపేట గుట్టల్లో మోడల్ స్కూల్ భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు భూమిపూజలు, శిలాఫలకాల ఆవిష్కరణలు చేయడం తప్ప అభివృద్ధి చేసిందిలేదని ఆరోపించారు. నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకురాల భూమి, విద్యార్థులకు ఫీజు రియాంబర్స్‌మెంట్ హామీలు ఏమయ్యాయో సీఎం కేసీఆర్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చుతున్నారని, మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణను ఐదు లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో 72వేల కోట్ల నిధులతో ఏకకాలంలో లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్, ఆకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు, ఉచిత కరెంట్ అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్, 6 గ్యారెంటీ స్కీం, ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని వెల్లడించారు. ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని, బీఆర్ఎస్‌కు గద్దె దింపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, గజ్జి ఐలయ్య, వలిహైదర్, మారెపల్లి రాజేందర్, కట్టయ్య, రాజు, రాజేందర్, కుమారస్వామి, ప్రభాకర్, రమేష్, మార్కండేయ, జంగారెడ్డి, ప్రపంచరెడ్డి ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న గొప్ప నేత మోదీ

ఆత్మకూరు: ప్రజలకు హామీలను నెరవేరుస్తున్న గొప్ప నేత ప్రధానమంత్రి మోదీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్, లింగమడుగు పల్లె గ్రామాల్లో సోమవారం గడపగడపకు కరపత్రాలు అందించారు. అలాగే జిల్లాకు గిరిజన యూనివర్సిటీ మంజూరు చేసిన సందర్భంగా ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో పబ్బం గడుపుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌టీఐ కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలను ఎవరూ నమ్మరు


పరిశీలిస్తున్న ఎర్రం రామన్న

శాయంపేట : సీఎం కేసీఆర్ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ హనుమకొండ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ ఎర్రం రామన్న అన్నారు. స్వశక్తికరన్ అభియాన్‌లో భాగంగా మండలంలోని శాయంపేట, కొప్పుల, పెద్దకోడెపాక బూత్ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని బూత్‌లల్లో స్వశక్తికరన్ అభియాన్ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే ఎరువుల్లో 80 శాతం సబ్సిడీ అందిస్తుందని, పసుపు రైతులకు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, నాగరాజు, విజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.